
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు

5

సోమవారం 1 డిసెంబరు 2025

కొనుగోలు కేంద్రంలో దోపిడీ

బస్తాకు రెండు కిలోలు అదనంగా తూకం 8

నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లిలో చేతివాటం

పాటలు కడతాం..

ప్రచార సామగ్రి అందిస్తాం 7



ఐఐటీహెచ్‌లో హాఫ్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న బానోతు పావని, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఉమాహారతి

ఉత్సాహంగా హాఫ్ మారథాన్

ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో సందడి

2,200 మంది రన్నర్లు హాజరు

ప్రారంభించిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ కాంస్య పతక విజేత బానోతు పావని

కంది, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫిట్ ఇండియా స్ఫూర్తితో హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన హాఫ్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. 21-కే, 10-కే, 5-కే ఫన్ రన్ పేరిట నిర్వహించిన రన్‌ను వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ కాంస్య పతక విజేత పావని బానోత్, నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్, ఐఐటీహెచ్ పూర్వ విద్యార్థి ఉమా హారతి, అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన 2,200 మంది పరుగు పందాల్లో పాల్గొన్నారు. చిన్నారులు, యువకులు, వృద్ధులు, ఐఐటీహెచ్ అధ్యాపకులు, విద్యార్థులు తరలిరావడంతో ఐఐటీహెచ్ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఉదయం 5 గుటలకు ప్రారంభమైన మారథాన్ 10 గంటల వరకు కొనసాగింది. విజేతలు సునివాదిలా, విపిన్ త్యాగి, సత్యనారాయణలకు ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి బహుమతులను అందజేశారు. మారథాన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బానోత్ పావని మాట్లాడుతూ చదువుతో పాటు శారీరక దృఢత్వం పెంపొందించుకునేందుకు ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో చైతన్యం తీసుకొస్తాయన్నారు. ప్రజలందరితో సహకారం, స్నేహభావంతో జీవనశైలిపై అవగాహన కల్పించడానికి ఈ రన్ ఉపయోగపడుతుందని ఐఐటీ హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చినవారు ఐఐటీహెచ్‌లోని భవన సముదాయాలను, ప్రకృతి అందాలను తిలకించి మంత్రముగ్ధులయ్యారు.



హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న రన్నర్లు

శ్రమతోనే ఆరోగ్యం



సౌత్ ఆఫ్రికా నుంచి హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేయడానికి వచ్చాను. ఐఐటీహెచ్ 21-కే మారథాన్‌లో పాల్గొన్నారు. వ్యాయామం, శ్రమతో శరీరంతో పాటు మనసు దృఢంగా మారుతుంది. ఐఐటీహెచ్‌ను సందర్శించడం సంతోషకరం

-చిండి సైమన్, సాఫ్ట్‌వేర్, సౌత్ ఆఫ్రికా

రన్నింగ్‌తో ఒత్తిడి మాయం



ప్రతీ రోజు రన్నింగ్ చేయడంతో ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు ఒత్తిడి మాయమవుతుంది. వాకింగ్, జాగింగ్ అయినా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. నేను ప్రతి రోజూ గంట రన్నింగ్ చేస్తాను. ఐఐటీహెచ్‌లో 10-కే మారథాన్‌లో ఎలాంటి అలుపు లేకుండా నేను గంటకుపైగా పరుగెత్తగలిగాను

-సంజన, హర్డ్‌వేర్, చంపాపేట్



ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డిని సన్మానిస్తున్న వాసవిక్లబ్ ప్రతినిధులు

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం : ఎంపీ

కంది, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్ చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. సంగారెడ్డి సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ ఇరుకుల్ల ప్రదీప్ ఆధ్వర్యంలో స్వదీపోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి క్లబ్ ద్వారా సమాజంలోని ప్రతీ వర్గం కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా సామాజిక శాంతి నెలకొంటుందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని, ఆయన బాటలో ప్రతీ ఒక్కరం నడవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ రహిత వ్యాపార కార్యకలాపాలు చేయడం ద్వారా పర్యావరణహితానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సిద్ధ సూర్యప్రకాశరావు, తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, కెమిస్ట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల సంతోష్ కుమార్, కంది చందుగుప్తా, వనం నరేందర్ పుట్నాల లక్ష్మణ్, కటకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల 'ట్రేడ్' మాయ

గడ్డపోతారం, బొల్లారం మున్సిపాలిటీల్లో 130 పరిశ్రమలు

లైసెన్స్ తీసుకున్నది ఒకే ఒక్కటి!

వేలల్లో వాణిజ్య భవనాలు.. అన్నీ రెసిడెన్షియల్ ఖాతాలోనే!

పన్ను ఎగవేతతో మున్సిపల్ ఆదాయానికి గండి

నూతన పన్ను విధానం అమలుకు అధికారుల కసరత్తు



జిన్నారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారి ఏడాది కావస్తున్నా, గడ్డపోతారం మున్సిపాలిటీకి ఆదాయ వనరులు చేకూరడంలో జాప్యం జరుగుతోంది. వందకు పైగా పరిశ్రమలు, వేలల్లో వాణిజ్య భవనాలు ఉన్నా ట్రేడ్ లైసెన్సుల పట్ల అనాసక్తి చూపడంతో ఆస్తిపన్ను ఆదాయానికి గండి పడుతోంది. మున్సిపల్ పరిధిలోని కాజీపల్లి, గడ్డపోతారం గ్రామాలలో ఉన్న 130 వరకు పరిశ్రమలకు గాను కేవలం ఒకే ఒక్క పరిశ్రమ మాత్రమే ట్రేడ్ లైసెన్స్ తీసుకుంది. 3,650 భవనాలుండగా 15 మాత్రమే వాణిజ్య భవనాల కింద నమోదు చేసుకుని పన్ను చెల్లిస్తున్నారు. ఇదే పరిస్థితి బొల్లారం మున్సిపాలిటీలోనూ నెలకొంది.

లైసెన్స్ లేకుండానే పరిశ్రమల నిర్వహణ

ప్రస్తుతం మున్సిపాలిటీకి ఏటా రూ. 5.91 కోట్ల ఆదాయం ఉన్నది. నిబంధనల మేరకు ప్రతీ పరిశ్రమ, వ్యాపార సంస్థకు లైసెన్సులు జారీచేసి, లెక్కలు పక్కాగా తేలిస్తే ఈ ఆదాయం రెట్టింపయ్యే అవకాశం ఉంది. ట్రేడ్ లైసెన్స్ పొందితే ఆయా సంస్థల పరిధి, వ్యాపార కార్యకలాపాల స్థాయిమేరకు పన్నులు చెల్లించాల్సి వస్తుంది. దీంతో పన్ను భారం తప్పించుకోవడానికి పరిశ్రమలు లైసెన్సులు తీసుకోవడానికి ముందుకు రావట్లేదు. ప్రస్తుతం ఒకే ఒక్క పరిశ్రమ, 15 వాణిజ్య భవనాలు మాత్రమే లైసెన్స్‌లు తీసుకున్నాయి.

నివాస అనుమతితో వాణిజ్య వినియోగం

మున్సిపల్ పరిధిలోని అనేక భవనాలు గతంలో పంచాయతీల నుంచి నివాసాల కోసం అనుమతులు పొందినా, వాటిని ప్రస్తుతం వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తున్నారు. నగర శివారు ప్రాంతం కావడంతో భారీగా అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు నిర్మితమవుతున్నా నివాస గృహాల కేటగిరీలోనే ఆస్తి పన్నులు చెల్లిస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు.

రహదారి వైశాల్యం ఆధారంగా పన్నులు

మున్సిపాలిటీలో ఆస్తి పన్నుల పెంపు, వసూళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేయనుంది. ఈ విధానంలో పరిశ్రమలు, వాణిజ్య భవనాలు ఉండే ప్రాంతాల రహదారుల వెడల్పు ఆధారంగా పన్నుల శాతాన్ని నిర్ణయించారు. 20 అడుగుల రోడ్డులో ఉన్నవాటికి చదరపు అడుగుకు మూడు రూపాయలు, 30 ఫీట్ల రోడ్డులో (డబుల్ లైన్) చదరపు అడుగుకు రూ.4, మల్టిపుల్ లైన్ రోడ్లు ఉన్న ప్రదేశంలో చదరపు అడుగుకు రూ.5, హోటళ్లు, కార్పొరేట్ హాస్పిటళ్లకు చదరపు అడుగుకు రూ.6, పరిశ్రమల స్థాయిని బట్టి చదరపు అడుగుకు రూ.4 నుంచి రూ. 7 పన్ను చెల్లించాల్సి ఉంటుంది. నూతన విధానంతో పన్నులు భారీగా పెరిగే అవకాశం ఉండడంతో పరిశ్రమల యజమానులు లైసెన్స్‌లు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు.

> **నోటీసుల జారీకి కసరత్తు**
>
> గడ్డపోతారం మున్సిపాలిటీలో పన్నుల రాబడి పెంచేందుకు చర్యలు చేపట్టాం. ప్రభుత్వ నిబంధనల మేరకు పరిశ్రమలకు నోటీసులు జారీచేసి ట్రేడ్ లైసెన్సులు ఇస్తాం. ఆయా సంస్థల పరిధిని నిర్ధారించి ఆస్తిపన్ను విధిస్తాం.
>
> **-వెంకటరామయ్య, మున్సిపల్ కమిషనర్**

బీజేపీ మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా బొక్క నర్సింహారెడ్డి



నర్సింహారెడ్డి

కందుకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా పార్టీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డిని నియమించారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ గౌతమ్‌రావు నియామకపత్రాన్ని అందజేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంకొత్తగూడ గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి విద్యార్థి దశ నుంచి బీజేపీలో కొనసాగారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు శ్రమించారు. ఆయన సేవలను గుర్తించి పార్టీ మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించినట్లు సమాచారం పేర్కొన్నారు.

సర్పంచ్‌గిరి..

వద్దు బాబోయ్!

- బరిలో నిలిచేందుకు తాజా మాజీల అనాసక్తి
- పెండింగ్ బిల్లులు, నిధులు రావన్న కారణంతోనే..
- పోటీలో 85 శాతం కొత్తవారే

7

మెదక్ జిల్లాలో తొలి విడత 678 నామినేషన్లు ఆమోదం

మెదక్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తొలి విడత పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన ఆదివారం నిర్వహించారు. మెదక్ జిల్లాలో ఆరు మండలాల పరిధిలో 160 సర్పంచ్ స్థానాలకు 842 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అధికారులు నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం 164 నామినేషన్లను తిరస్కరించారు. అన్ని పత్రాలు సమర్పించిన 678 మంది నామినేషన్లను ఆమోదించారు. జిల్లావ్యాప్తంగా 1,402 వార్డులకు 2,919 నామినేషన్లు వచ్చాయి. పరిశీలనలో 100 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. 2 819 నామినేషన్లు ఆమోదించబడ్డాయని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య తెలిపారు. పాపన్నపేట మండలం అర్కెల గ్రామ పంచాయతీ పరిధిలో రెండు వార్డులకు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. 14 వార్డులకే ఎన్నికలు జరగనున్నాయి.

రెండో విడత నామినేషన్లు షురూ



తూప్రాన్‌లో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా తరలివస్తున్న ఇమాంపూర్ గ్రామస్తులు

సంగారెడ్డిటౌన్, నవంబరు 30, (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ఆదివారం నాడు ప్రారంభమైంది. మొదటి విడత సంగారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో నామినేషన్ల ప్రక్రియ శనివారం ముగిసిన విషయం తెలిసిందే. రెండవ విడతగా అందోలు-జోగిపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలు, జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలు, సంగారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలోని మునిపల్లి మండలంలో రెండవ విడత ఎన్నికలు జరుగనున్నాయి. రెండవ విడత జిల్లాలోని 243 గ్రామ పంచాయతీలకు, 2164 వార్డులకు డిసెంబరు 14వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా తొలిరోజైన ఆదివారం నాడు సర్పంచు స్థానాలకు 141 నామినేషన్లు, వార్డులకు 200 నామినేషన్లు దాఖలయ్యాయి. డిసెంబరు 2వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. రెండవ విడత మండలాలవారీగా సర్పంచ్ కోసం అందోల్ 19, చౌటకూరు 10, పుల్కల్ 12, వట్‌పల్లి 16, రాయికోడ్ 19, ఝరాసంగం 6, జహీరాబాద్1 5, మొగుడంపల్లి 13, కోహీర్ 14, మునిపల్లి 17 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డుల కోసం మండలాలవారీగా అందోల్ 45, చౌటకూరు 40, పుల్కల్ 24, వట్‌పల్లి 9, రాయికోడ్ 13, ఝరాసంగం 4, జహీరాబాద్ 11, మొగుడంపల్లి 13, కోహీర్ 18, మునిపల్లి 23 నామినేషన్లు దాఖలయ్యాయి.

మెదక్ జిల్లాలో 155 నామినేషన్లు

మెదక్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలు రెండో విడత ఎనిమిది మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఆదివారం జిల్లా వ్యాప్తంగా సర్పంచ్ స్థానాలకు 155 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డుల కోసం మండలాలవారీగా చేగుంట 46, మనోహరాబాద్ 76, మెదక్ 33, నార్సింగి 12, నిజాంపేట 32, రామాయంపేట 14, చిన్నశంకరంపేట 32, తూప్రాన్ 16 నామినేషన్లు దాఖలయ్యాయి.



తూప్రాన్‌లో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

అభ్యర్థులకు సత్వరమే బ్యాంకు ఖాతాలు, ధ్రువీకరణ పత్రాలు

సంబంధిత శాఖలను ఆదేశించాం

ఏకగ్రీవం కోసం ఒత్తిడి చేస్తే కఠిన చర్యలు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

తూప్రాన్/మనోహరాబాద్/చేగుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు అవసరమైన కొత్త బ్యాంకు ఖాతాలు, ధ్రువీకరణ పత్రాలు సత్వరమే జారీ చేయాలని బ్యాంకు మేనేజర్లు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. తూప్రాన్, మనోహరాబాద్, చేగుంటలో నామినేషన్ల ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. జిల్లాలోని తూప్రాన్, మెదక్ డివిజన్ల పరిధిలోని తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, నార్సింగి, చిన్నశంకరంపేట, మెదక్ మండలాల్లో నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. నామినేషన్ల సందర్భంగా అందజేయాల్సిన పత్రాలను చెక్‌లిస్టు ప్రకారం చివరి రోజు వరకు అందజేయాలని పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకోవడం కోసం వేలం నిర్వహించినా, ప్రలోభాలకు గురిచేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు భారతి లక్పతినాయక్, అదనపు కలెక్టర్ నగేష్ వేర్వేరుగా నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు.

మీటింగ్‌లకు అనుమతి తప్పనిసరి : కలెక్టర్

మెదక్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ప్రచారం కోసం నిర్వహించే పబ్లిక్ మీటింగ్, ర్యాలీలకు అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. పోలింగ్‌కు 44 గంటల ముందు నుంచే బహిరంగ సభలు, ఊరేగింపులు నిషేదమన్నారు. లౌడ్ స్పీకర్లు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే ఉపయోగించాలన్నారు. నిబంధనలు ఉల్లఘించినట్లయితే పోలీసు అధికారులు మైకులు జప్తు చేస్తారన్నారు. సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థులు గ్రామ పంచాయతీ పరిధిలోని తమ ప్రచారానికి ఒక వాహనాన్ని ఉపయోగించడానికి అనుమతి ఉంటుందన్నారు. వార్డు సభ్యులు ఎలాంటి వాహనాన్ని ఉపయోగించకూడదన్నారు. వాహన అనుమతులు సంబంధిత తహశీల్దార్లు జారీ చేస్తారని కలెక్టర్ వివరించారు.

బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల

పనులు ప్రారంభించకుంటే ఆందోళన

సంగారెడ్డి జిల్లా అంటే చిన్న చూపెందుకు?

నారాయణఖేడ్ నియోజకవర్గంలో రోడ్లు అధ్వానం

మాజీ మంత్రి హరీశ్‌రావు

నారాయణఖేడ్/కల్హేర్/సిర్గాపూర్/పెద్దశంకరంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాల పనులను ప్రారంభించకపోతే ఆందోళన చేపడతామని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని అనంత్‌సాగర్ మల్లన్నజాతర ఉత్సవం, సిర్గాపూర్‌లో స్థానిక మల్లన్న స్వామి ఆలయ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దశంకరంపేట మండలంలో వివిధ పార్టీల నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారిని కండువా కప్పి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోని బీడు భూములను సస్యశ్యామలం చేయడానికి బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని ఆరోపించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా మారాయని విమర్శించారు. తమ ప్రభుత్వం నియోజకవర్గంలో 8 చెరువుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తండాల అభివృద్ధికి తమ ప్రభుత్వం రూ. 100 కోట్లు మంజూరు చేసినా పనులు చేపట్టడం లేదని మండిపడ్డారు. డంపుయార్డులు, పంచాయతీ ట్రాక్టర్లు మూలనపడ్డాయన్నారు. ఎన్నికల కోసమే స్వయం సహాయక బృందాల సభ్యులకు చీరలు ఇస్తున్నారని ఆరోపించారు. మొక్కజొన్న, సోయా విక్రయించిన రైతులకు డబ్బులు చెల్లించడం లేదన్నారు. మాయమాటలు చెప్పి కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. యాదవులపై గౌరవంతోనే కేసీఆర్ మల్లన్నసాగర్‌కు ఆ పేరు పెట్టారని అన్నారు.

నారాయణఖేడ్‌లో సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ బిక్షపతి, బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు మోహీద్‌ఖాన్, పటాన్ చెరు బీఆర్ఎస్ నాయకుడు శ్రీకాంత్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పరమేశ్వర్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌బుజ్జి, మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ రుబీనానజీబ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ స్వప్న అభిషేక్ షెట్కార్, డైరెక్టర్ గోపాల్, వెంకటేశం, గీతారెడ్డి, తదితరులు ఉన్నారు. మరో కార్యక్రమంలో పోతన్‌పల్లి స్వరూపరాములు, తుర్కపల్లి రఘునాథ్, వెంకట్‌రెడ్డిని ఆయన కండువాలు కప్పి బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. సిర్గాపూర్‌లో సంజీవరావ్ పాటిల్, నర్సాగౌడ్, రాజుగౌడ్, పరమేష్, నగేష్‌గుప్తా, యాదవరావ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ దశరత్, గొట్టి ముక్కుల మాజీ సర్పంచ్ ఉదయశ్రీసూర్యప్రకాష్‌తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి 200 మంది హరీశ్‌రావు సమక్షంలోబీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, జంగం రేణుక, అవుసుల భవాని, జంగం రాఘవులు, సుభాష్, సురేష్‌గౌడ్, వెంకటరెడ్డి, అడివయ్య, కోణం అంజయ్య, సూర్యప్రకాష్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఆలయాల్లో సండే సందడి

● భారీగా తరలివచ్చిన భక్తులు ● వెల్లివిరిసిన భక్తి పారవశ్యం



నాచగిరిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వర్గల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రానికి ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు.

● పాపన్నపేట : ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, జంట నగరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.



ఏడుపాయల దుర్గామాతను దర్శించుకుంటున్న భక్తులు

● కొమురవెల్లి : ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నిధిలో భక్తులు సందడి చేశారు. గంగిరేణి చెట్టు వద్ద, ఆలయ ముఖమండపంలో పట్నాలు వేసి బోనాలు చెల్లించారు. నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు అనంతరం స్వామివారిని దర్శించుకొని బండారు, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. విజయాచల గుట్టపై ఉన్న ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లకు పట్టువస్త్రాలు బోనాలు సమర్పించారు. బెల్లం,కల్లు సాక సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో టంకశాల వెంకటేష్, ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఇతర సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొమురవెల్లి గ్రామానికి చెందిన ఉప్పల అశోక్‌రాజు 490గ్రాముల వెండి పాత్రను ఆదివారం స్వామివారికి బహూకరించారు.

పెద్దచీకోడు రేణుకాదేవి ఆలయ అభివృద్ధికి శ్రీకారం

● ముందుకు వచ్చిన భూరత్నం కన్‌స్ట్రక్షన్ కంపెనీ

దుబ్బాక, నవంబరు30(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం పెద్దచీకోడు గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం అభివృద్ధికి ఆదివారం రూ.12.60 లక్షలతో శ్రీకారం చుట్టారు. దీనికోసం సికింద్రాబాద్‌కు చెందిన భూరత్నం కన్‌స్ట్రక్షన్ కంపెనీ ముందుకు వచ్చింది. ముందుగా రూ.4 లక్షలతో ఆలయం కమాన్ నిర్మాణానికి ఆ సంస్థ ప్రతినిధులు రోహిత్ , గడ్డం శ్రీరామ్‌గౌడ్‌లు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పెద్ద చీకోడ్ గ్రామ గౌడ సంఘం సభ్యులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో గౌడ్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు కాసారం రమేష్‌గౌడ్, గ్రామ గౌడ యువజన సంఘం అధ్యక్షులు కాసారం వెంకటేష్ గౌడ్, గడ్డం వెంకటేశ్‌గౌడ్, రామాగౌడ్, భూపతి గౌడ్, రాజాగౌడ్, నరేష్‌గౌడ్, కిషన్‌గౌడ్, తదితరులున్నారు.



ఆలయ కమాన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఆగని వెనుకమెట్ల దర్శనాలు..

కొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నిధిలో వెనక మెట్ల గుండా దర్శనానికి వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆలయాధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదు. ప్రతీ ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉంటుండడంతో పలువురు భక్తులు వెనక మెట్ల గుండా వెళ్లి స్వామివారిని దర్శించుకుంటున్నారు. దీంతో దర్శనం చేసుకుని బయటకు వస్తున్న భక్తులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అంటూ చేతులు దులుపుకుంటున్నారు.



కొమురవెల్లిలో స్వామివారి నిత్య కల్యాణంలో భక్తులు



విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జాతీయ క్రీడలకు వేదిక పటాన్‌చెరు

పటాన్‌చెరు నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు జాతీయస్థాయి క్రీడలు వేదిక మారనుందని, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మైత్రిమైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలు ముగింపు కార్యక్రమంలో ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో జాతీయ కబడ్డీ క్రీడలు నిర్వహించడానికి చర్చలు జరుగుతున్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు వివిధ రంగాల్లో వలసలు వెళ్తున్నారని తెలిపారు. ఫలితంగా గ్రామీణ ఆటలు గుర్తింపు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని చెప్పారు. ఇప్పటికే క్రికెట్, వాలీబాల్ ఆటలు నిర్వహించి పటాన్‌చెరుకు గుర్తింపు తెచ్చామన్నారు. అండర్14 బాలురు విభాగం పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా ప్రథమం, రంగారెడ్డి జిల్లా ద్వితీయం, హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ఆదిలాబాద్ ప్రథమ, మహబూబ్‌నగర్ ద్వితీయం, నల్గొండ మూడోస్థానంలో నిలిచాయి. విజేత జట్లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, శ్రీకాంత్‌గౌడ్, హరికిషన్, హనుమంత్‌రెడ్డి, శ్రీనివాస్, సీఐ వినాయకరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, రవీందర్ తదితరులు ఉన్నారు.

కరాటేలో మెదక్ విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ట్రోఫీలను సాధించిన విద్యార్థులు

మెదక్ అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం హైదరాబాద్‌లో యూనివర్సల్ 369 ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ టోర్నమెంట్‌లో శేఖర్ బుడోకస్ కరాటే అండ్ యోగిక్ అకాడమీ మెదక్ భరత్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో శ్రీహిత, సాయిమాధవ్, హర్ష, క్షితిష్ రామ్‌లు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కరాటే అకాడమీ టీం మేనేజర్ శివ తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ఎస్‌బీకేవైఏటీ ఫౌండర్ శేఖర్, మాస్టర్లు సుభాష్, యాదగిరి అభినందించారు.

రగ్బీలో ఉమ్మడి మెదక్‌కు మూడో స్థానం

మెదక్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. పాఠశాల క్రీడా సమాఖ్య తెలంగాణ ఆధ్వర్యంలో డోర్నకల్, మహబూబాబాద్‌లో గత మూడు రోజులుగా రాష్ట్రస్థాయి అండర్-17 బాల బాలికల టోర్నమెంట్ జరిగింది. కరీంనగర్, మెదక్ జిల్లా మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ఉమ్మడి జిల్లా 29-7 పాయింట్స్ తేడాతో కరీంనగర్‌పై విజయం సాధించింది. బాలికల విభాగంలో మెదక్ జిల్లా జట్టు 7-0 తేడాతో నల్గొండపై గెలిచి తృతీయ స్థానంలో నిలిచినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు 28 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కబడ్డీ క్రీడాకారులు

పాపన్నపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ సబ్ జూనియర్ బాలబాలికల మెదక్ జిల్లా నుంచి 28 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రమేష్ వెల్లడించారు. ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాపన్నపేటలో ఆదివారం ఎంపిక పోటీలు నిర్వహించారు. మొత్తం 145 మంది పోటీల్లో పాల్గొనగా రెండు విభాగాలకు 14 మంది చొప్పున ఎంపిక చేసినట్లు వివరించారు. బాలల విభాగం క్రీడాకారులు మహబూబ్‌నగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొనుండగా, బాలికల విభాగం వారు నల్గొండలో జరిగే పోటీల్లో మెదక్ జిల్లా నుంచి పాల్గొంటారని వివరించారు. ఈ ఎంపికలో అసోసియేషన్ సభ్యులు గోపాల్, శ్రీకాంత్, రవి , శేషు ప్రశాంత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు బేగంపేట ఉపాధ్యాయుడు



భాస్కర్‌రెడ్డి

రాయపోల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు కొల్కూరి భాస్కర్‌రెడ్డి ప్రఖ్యాత ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారు. 2025 డిసెంబర్ 6 నుంచి 9 వరకు హర్యానాలోని పంచకుల క్యాంపస్‌లో నిర్వహించన్ను ఎడ్యుకేషన్ ఫర్ ఆస్పైరింగ్ ఇండియా-సైన్స్ సఫారీ, గేమ్స్ అండ్ అడ్వెంచర్స్ వర్క్‌షాప్‌కు ప్రతినిధిగా ఆయన రెండోసారి ఎంపిక కావడం గమనార్హం. సైన్స్ బోధనలో కొత్త పద్ధతులు, వినూత్న ఆలోచనలు, ప్రాయోగిక ఆవిష్కరణలను ఆయన ప్రదర్శించనున్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రమీల, ఉపాధ్యాయ బృందం భాస్కర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

మాసాయిపేటలో కోతికి అంత్యక్రియలు



మాసాయిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం మృతి చెందిన కోతి కళేబరానికి గ్రామపంచాయతీ సిబ్బంది ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన మాసాయిపేటలోని ట్విట్టర్లేశ్వర ఆలయం వద్ద రెండు రోజుల క్రితం ఓ కోతి మృతి చెందింది ఈ విషయం తెలుసుకున్న మాసాయిపేట గ్రామ పంచాయతీ సిబ్బంది ఆదివారం కొద్ది దూరంలో నిర్మానుష్య ప్రాంతంలో కోతి కళేబరానికి అంత్యక్రియలు నిర్వహించారు మానవతా దృక్పథంయి చాటిన గ్రామపంచాయతీ సిబ్బందిని స్థానికులు అభినందించారు

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం

● మృతుడు నార్సింగి మండలం నర్సంపల్లివాసి



రియాజ్(ఫైల్)

రామాయంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన రామాయంపేట బైపాస్ పై ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నార్సింగి మండలం నర్సంపల్లికి చెందిన రియాజ్(32) లారీ డ్రైవర్. శనివారం అతడు మరో యువకుడు ఇస్మాయిల్‌తో కలిసి రామాయంపేట నుంచి బైక్‌పై హైదరాబాద్ వైపు వెళ్తుండగా అదుపుతప్పి కిందపడడంతో రియాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక సీట్లో కూర్చున్న ఇస్మాయిల్ తీవ్రంగా గాయ పడ్డాడు. శనివారం ఇంటి నుంచి వెళ్లిన రియాజ్ రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆదివారం ఉదయం అతడి మొబైల్‌కు ఫోన్ చేయగా పోలీసులు మాట్లాడి మృతి చెందిన విషయం తెలిపారు. దీంతో ప్రభుత్వాసుపత్రి మార్చురీకి వారు వచ్చి మృతదేహాన్ని చూసి రియాజ్‌దిగా గుర్తించారు. మృతుడికి భార్య నజ్రీమ్ సుల్తానా, కుమారుడు ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని మీడియాకు చూపుతున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

గజ్వేల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, సొత్తును రికవరీ చేసినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్ మండలం శేరిపల్లి బందారంకు చెందిన పొత్తుల నాగరాజు(33) నవంబరు 26న మధ్యాహ్నం గజ్వేల్ పట్టణంలోని మంజునాథ వైన్స్‌లో రాయపోల్ మండలం గొల్లపల్లికి చెందిన కొత్త కుర్మ నరసయ్య(65)ను పరిచయం చేసుకున్నాడు. అనంతరం మద్యం తాగిపిస్తానని చెప్పి నరసయ్యను నమ్మించి జాలిగామ బైపాస్ రోడ్డులో ఉన్న చెట్లపొదల్లోకి తీసుకువెళ్లి ఫుల్‌గా మద్యం తాగించాడు. అనంతరం మత్తులోకి జారుకున్న తరువాత నరసయ్య ఒంటిపై ఉన్న ఆభరణాలను నాగరాజు దొంగలించాడు. ఈ మేరకు ఫిర్యాదు అందుకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రెండు వెండి కడియాలు, రెండు వెండి ఉంగరాలు, ఒక్క బాలిపోగు(2.5 గ్రాముల బంగారం), సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు ఛేదనకు కృషి చేసిన అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు, ఎస్‌ఐ మల్లారెడ్డి, కానిస్టేబుళ్లు రవి, సురేందర్, దివ్య, వెంకటేశ్, నగేశ్‌లను గజ్వేల్ ఏసీపీ నర్సింహులు అభినందించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

భర్తతో గొడవ పడి మహిళ అదృశ్యం



సుకన్య (ఫైల్)

తూప్రాన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవ పడిన మహిళ కనిపించకుండా పోయిన సంఘటన తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌లో చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా రాయపోలు మండలం అప్పాయపల్లికి చెందిన పోటరి సుకన్య(32)కు 13 ఏళ్ల క్రితం తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌కు చెందిన పోటరి నగేశ్‌తో వివాహం జరిగింది. ఈ నెల 28న రాత్రి పోటరి సుకన్య, నగేశ్ మధ్య గొడవ జరిగింది. దీంతో 29న మధ్యాహ్నం ఇంట్లో ఎవరికి చెప్పకుండా సుకన్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం చుట్టుపక్కల, బంధుమిత్రుల వద్ద వెతికినప్పటికీ ఆచూకి లభించలేదు. దీంతో ఆదివారం సుకన్య తండ్రి డాకి భిక్షపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



38 జీపీల్లో 15 తండాలే..

● అక్కన్నపేట మండలంలో అత్యధికంగా గిరిజన తండాలు

● జిల్లాలోనే అధిక గ్రామ పంచాయతీలూ ఇక్కడే

హుస్నాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అత్యధికంగా గిరిజన తండాలు పంచాయతీలుగా ఉన్న మండలం అక్కన్నపేట. ఇక్కడ 38 గ్రామ పంచాయతీలుంటే అందులో 15 గిరిజన తండాల పంచాయతీలే. అంతేకాదు జిల్లాలో అత్యధికంగా గ్రామ పంచాయతీలున్న మండలం కూడా అక్కన్నపేటనే. జిల్లాల పునర్విభజనలో భాగంగా 2016 అక్టోబరులో హుస్నాబాద్ మండలం నుంచి కొత్తగా అక్కన్నపేట మండలాన్ని ఏర్పాటు చేశారు. మొదట 23 గ్రామ పంచాయతీలతో ఏర్పడిన ఈ మండలం తండాలను జీపీలు చేయడంతో మరో 9 పెరిగాయి. ఇటీవల మరో 6 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతో మొత్తం 38కి చేరాయి. ఇందులో చాపగానితండా, చౌడుతండా, దాసుతండా, దుబ్బతండా, అంబానాయక్‌తండా, కపూర్‌నాయక్‌తండా, కేశనాయక తండా, మైసమ్మవాగు తండా, మత్తేరుతండా, పంతులుతండా, పెద్దతండా, సేవాలాల్ మహారాజ్‌తండా, శ్రీరామ్‌తండాలు గ్రామ పంచాయతీలుగా ఉన్నాయి. ఈ మండలంలో ఎస్టీ జనాభా 8351, ఎస్టీ ఓటర్లు 7881 మంది ఉన్నారు.

సర్పంచ్ గిరి.. వద్దు బాబోయ్

● బరిలో నిలిచేందుకు తాజా మాజీల అనాసక్తి

● పెండింగ్ బిల్లులు, నిధులు రావన్న కారణంతోనే..

● పోటీలో దాదాపు 85 శాతం మంది కొత్తవారే



గజ్వేల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో తాజా మాజీ సర్పంచ్‌లు పోటీకి దూరంగా ఉన్నారు. సర్పంచ్ గిరి వద్దు బాబోయ్ అంటూ... పక్కకు తప్పుకున్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా దూరంగా ఉండడమే మేలన్న ఆలోచనతో మండలానికి ముగ్గురు, నలుగురు తాజా మాజీలు నామినేషన్ వేయకుండా దూరంగా ఉండిపోయారు. గతంలో పనిచేసిన పనుల తాలూకా బిల్లులు పెండింగ్‌లో ఉండడం.. ప్రస్తుత ప్రభుత్వం గజ్వేల్ నియోజకవర్గానికి నిధులు విడుదల చేయడం లేదన్న అనుమానంతో పోటీకి దూరంగా ఉన్నారని తెలుస్తుంది. ఇక కొంత మంది సర్పంచ్‌గిరి వ్యాల్యూ లేదు బాస్... ఊరికి కాపాలాదారుగా మారిపోయాం అంటూ నిట్టూరుస్తున్నారు. గజ్వేల్ మండలంలో నాలుగు చోట్ల అవకాశం ఉన్నప్పటికీ తాజా మాజీలు పోటీకి విముఖత చూపారు. ములుగు మండలంలో ముగ్గురు తాజా మాజీ సర్పంచ్‌లకు అవకాశం ఉన్నప్పటికీ ఒకరు ఉన్నత పదవి కాంక్షతో దూరంగా ఉంటే మరో ఇద్దరు పాత బిల్లులే రాలేదని, పోటీ చేసినా పెద్ద ఫలితం లేదని మిన్నకుండిపోయినట్లు తెలుస్తుంది. వర్గల్ మండలంలోనూ అదే పరిస్థితి కనబడగా, జగదేవ్‌పూర్ మండలంలో బీసీలు ఉన్న చోట జనరల్ స్థానాలు రావడం, జనరల్ స్థానాల చోట బీసీ రిజర్వేషన్ రావడంతో పలువురికి పోటీకి అవకాశం రాకపోగా, మరో ఇద్దరు పోటీకి అనాసక్తి చూపినట్లు తెలుస్తుంది. మర్కుక్ మండలంలో ఇద్దరికి అవకాశం వచ్చినప్పటికీ పోటీ చేయడానికి ఆసక్తి చూపలేదు. కుకునూరుపల్లి, కొండపాక మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని, గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా గడ, ఎస్‌డీఎఫ్ నిధులు పెద్ద ఎత్తున వచ్చేవి. ప్రస్తుత ప్రభుత్వం గజ్వేల్ నియోజకవర్గానికి నిధులు ఇవ్వదన్న ఆలోచన చాలా మందిలో ఉందని తెలుస్తుంది. కాగా నియోజకవర్గ వ్యాప్తంగా 85శాతం మంది కొత్త ముఖాలే సర్పంచ్‌లుగా బరిలో దిగుతున్నారు.



మూడు జీపీల్లో ఏకగ్రీవం





ఏకగ్రీవంగా ఎన్నికైన చల్లపల్లి సర్పంచ్ అభ్యర్థి సంగీత, సాలోజిపల్లి సర్పంచ్ ఇర్షత్

టేక్మాల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చల్లపల్లి, హస్సన్ మహ్మద్‌పల్లి, పాలోజిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు దాదాపు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హస్సన్‌మహ్మద్‌పల్లి గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ నుంచి చందు సర్పంచ్ బరిలో నిలిచారు. ఇక ఎనిమిది వార్డు సభ్యుల స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. డిసెంబరు 3 తర్వాత ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు. ఇక చల్లపల్లి గ్రామ పంచాయతీలో ఎల్లంపల్లి సంగీత సర్పంచ్ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి నామినేషన్ వేసింది. ఇక్కడ సైతం 6 వార్డులకు ఒక్కో నామినేషన్ దాఖలయ్యాయి. ఇక సాలోజిపల్లి గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి ఇర్షత్‌ను సర్పచ్‌గా, ఎనిమిది వార్డు మెంబర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన నామినేషన్ పరిశీలన ప్రక్రియలో ఈ గ్రామాలకు ఒక్కో నామినేషన్ రావడంతో ఏకగ్రీవమయ్యాయి.

పాటలు కడతాం... ప్రచార సామగ్రి అందిస్తాం

● పంచాయతీ ఎన్నికలవేళ అభ్యర్థులకు కళాకారులు, వ్యాపారుల ఆఫర్లు



చేర్యాల ప్రాంతంలోని ఆడియో రికార్డింగ్ నిర్వాహకులు సోషల్‌మీడియాలో చేసిన పోస్ట్


చేర్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలతో గ్రామపంచాయతీల్లో వాతావరణం వేడెక్కింది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల గుణగణాలతీరుతో పాటలు కడతామని, ప్రచార సామగ్రి అందజేస్తామని పలువురు సోషల్ మీడియా వేదికగా పోస్టులు చేస్తున్నారు. చేర్యాల ప్రాంతంలో పలువురు ప్రైవేటు వీడియో, ఆడియో సంస్థల నిర్వాహకులు పోటీపడి మరి ఆఫర్లు ప్రకటిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో మనీ, మద్యంతోపాటు పాటల ప్రచారం కూడా అభ్యర్థుల గెలుపు, ఓటములను ప్రభావితం చేస్తున్నాయి. మరో రెండురోజుల్లో చేర్యాల ప్రాంతంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికలలో పోటీకి సంసిద్ధమైన పలువరు అప్పుడే ప్రచారాన్ని చేపడుతున్నారు. హామీలు, అభివృద్ధి, వ్యక్తిగత గుణగణాలు, సామాజికసేవ తదితర అంశాలతో కూడిన పాటలను సంసిద్ధం చేసుకునేందుకు పలువురు హైదరాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాలకు చెందిన వీడియో మేకర్స్ ఆడియో రికార్డింగ్ సెంటర్ల మద్దకు పరుగులు పెడుతున్నారు. దీంతో చేర్యాల తదితర మండలాలకు చెందిన వ్యాపారులు, కళాకారులు తాము పాటలు రచించి ఆడియో రికార్ట్స్, ఆల్బమ్స్, స్లోగన్స్ అందిస్తామని, ఇతర ప్రాంతాలకన్నా తక్కువ ధరకు ఇస్తామని ఆఫర్లు ప్రకటిస్తూ ఆకర్షిస్తున్నారు.

పట్నం నుంచి పల్లెటూరుకు..

సర్పంచ్ పదవి కోసం తహతహ

ఎంతైనా డబ్బు వెదజల్లేందుకు సిద్ధం

గ్రామ నాయకుల అయోమయం



దుబ్బాక, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో కొత్త ట్రెండ్ మొదలైంది. హైదరాబాద్ నుంచి గ్రామాలకు వస్తున్న వ్యక్తులు సర్పంచ్ పదవి కోసం ఆసక్తి చూపుతున్నారు. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవం కోసం పోటీపడి, స్థానిక నాయకత్వానికి తలనొప్పిగా తయారవుతున్నారు. దుబ్బాక మండలంలోని ఒక గ్రామంలో బీసీ మహిళా రిజర్వేషన్ ఉండగా, అక్కడి నుంచి ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన భార్యను బరిలో దించడానికి, గ్రామంలో ఏకగ్రీవం కోసం ప్రయత్నిస్తున్నారు. గ్రామంలో రెండు కోట్ల రూపాయలను కుల సంఘాలకు అందిస్తామనే ప్రతిపాదనలు కూడా ఇవ్వడంతో, ఎక్కడా లేని విధంగా గ్రామాభివృద్ధికి ఇతోధికంగా సహాయం అందిస్తామని బేరసారాలు చేయడంతో, ఆ గ్రామంలో ఆశావాహులైన నాయకులు అయోమయానికి గురవుతున్నారు. తాము ఇన్నాళ్లు స్థానికంగా ఉండి సేవ చేస్తే, తమకు ప్రజల నుంచి ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందోననే భయంలో నామినేషన్ల ఉపసంహరణ వరకు వేచి చూద్దామని అనుకుంటున్నారు. ఆదివారం మొదటి రోజు ఆ గ్రామం నుంచి ఇద్దరు నామినేషన్లు వేశారు. అయితే కుల సంఘాలు, యువకులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రతిపాదనకు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

హామీలిస్తూ..

అదే విధంగా బీసీ జనరల్ కేటగిరీ కలిగిన ఒక గ్రామంలో సిద్దిపేటలో నివాసం ఉండే ఒక నాయకుడు, ఆ గ్రామంలో ఎక్కువ జనాభా కలిగిన సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. అలాగే నియోజకవర్గంలోని ఒక గ్రామం ఓసీ మహిళా కేటగిరీలో ఉండటంతో, ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి 80 లక్షల విలువ గల రెండు ఎకరాల భూమిని గ్రామాభివృద్ధికి ఇవ్వడానికి ముందుకు వచ్చినట్టు తెలిసింది. అయితే ఆ ప్రతిపాదనకు ఆ గ్రామస్థులు ఓ నిర్ణయానికి రాలేకపోయారు. గ్రామంలోని అందరినీ ఒప్పించే ప్రయత్నం ముమ్మరంగా సాగుతోంది. ఆ గ్రామం పక్కనే ఉన్న మరో ఓసీ జనరల్ కేటాయింపు గల గ్రామంలో ఇలాంటి ప్రతిపాదనకు గ్రామ యువకులు, మాజీ సర్పంచులు ససేమిరా అన్నట్టు తెలిసింది.

ఏకగ్రీవం కోసం బేరసారాలు..

అలాగే మొదటి విడత జరుగుతున్న ఒక గ్రామంలో ఒక వ్యాపారి రూ.30 లక్షలకు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిసింది. అదే మండలంలో బీసీ జనరల్ కేటగిరీలో ఉన్న గ్రామంలో 10 లక్షలకు దాదాపుగా గ్రామస్థులంతా అంగీకరించినట్టు తెలిసింది. అదే మండలంలో ఓసీ జనరల్ కేటగిరీ గల గ్రామంలో పది లక్షలకు ఏకగ్రీవం కాగా, అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి క్యూ లైన్‌లో నిలబడి, రాత్రి పది గంటలకు నామినేషన్ వేశాడు. అయితే ఆ గ్రామంలో చివరికి అతడిని ఒప్పించే ప్రయత్నంలో ఉన్నారు. చాలా గ్రామాల్లో డబ్బు ప్రభావం పెరగడంతో స్థానిక నాయకత్వం కూడా రాజకీయాల పట్ల అనాసక్తితో ఉన్నట్టు తెలిసింది. గతంలో తాము ఏమీ సంపాదించలేమనీ, తిరిగి అప్పుల పాలవుతామని కూడా నిరాశ వెలిబుచ్చుతున్నట్టు తెలిసింది. ఏది ఏమైనా, రెండు రోజుల్లో గ్రామాల్లో పరిస్థితులు ఎలా మారు

జాతీయ ఆర్చరీ విజేత డీపీఎస్ కొల్లూరు



పతకాలు ప్రదానం చేసిన భీమ్‌సేన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ టైటిల్‌ను డీపీఎస్ (ఢిల్లీ పబ్లిక్ స్కూల్) కొల్లూరు కైవసం చేసుకుంది. రెండ్రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. డీపీఎస్ కొల్లూరు ఓవరాల్ చాంపియన్‌గా నిలవగా డీపీఎస్ మియాపూర్ ద్వితీయ, డీపీఎస్ నాదర్‌గుల్ తృతీయ స్థానాలను దక్కించుకున్నాయి. కాంపౌండ్, రికర్వ్, ఇండియన్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 17 రాష్ట్రాలకు చెందిన 200 ఆర్చర్లు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి డీపీఎస్ కొల్లూరు ప్రో వైస్‌చైర్మన్ టి.భీమ్‌సేన్, ప్రిన్సిపల్ సి.జె.వసంత పతకాలు ప్రదానం చేశారు.



ఎన్నికల 'బార్'

రామాయంపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అసలే స్థానిక ఎన్నికల నామినేషన్లు.. అందునా ఆదివారం.. సోమవారం నుంచి కొత్త ఎక్సైజ్ సంవత్సరం కావడంతో ఒక్కసారిగా నాలుగు వైన్స్‌లు మూతపడ్డాయి. ఇంకేముంది రామాయంపేట పట్టణంలో ఉన్నది ఒక్కటే ఒక్క బార్ వద్ద మందుబాబులు క్యూ కట్టారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ బార్ ఎదుట మందుబాబుల బారులు తీరారు ఇలా.

భళా.. బండిషిడీ

● అనంతసాగర్‌లో ఘనంగా మల్లన్న జాతర



నారాయణఖేడ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దైవభక్తి ముందు సాహసం బలాదూర్ అని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అనంత్‌సాగర్ వాసులు నిరూపిస్తున్నారు. ఇక్కడ ఆదివారం నిర్వహించిన మల్లన్నజాతరలో బండిషిడీ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. భగవంతుడిపై నమ్మకం, దైవ భక్తితో పొడవాటి కర్రతో మనిషిని వేలాడదీసి బండికి కట్టి దేవాలయం చుట్టూ తిప్పారు. ఉత్సవాలకు నిర్వాహకులు, గ్రామస్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానికుడు గొల్లరాములు షిడీ ప్రదర్శనలో పాల్గొన్నారు. మల్లన్న జాతరకు సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

దత్తాచల స్వామి ఉత్సవాలలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ



దత్త జయంతి బ్రహ్మోత్సవాల్లో మాజీ గవర్నర్ దత్తాత్రేయ తదితరులు

హత్నూర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దత్తాచల క్షేత్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులోని దత్తాచల క్షేత్రంలో దత్త జయంతి బ్రహ్మోత్సవాల్లో మాజీ గవర్నర్ దత్తాత్రేయ ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్ర అభివృద్ధి కోసం తన వంతుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి నిధులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. స్వయంభు ఏకముఖ దత్తుడు వెలసిన దత్తాచల క్షేత్రం పురాణంలో సైతం ఉండడం, తాను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా క్షేత్రపతి సభాపతిశర్మ దత్తాత్రేయకు స్వామివారి ప్రసాదం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మురళీధర్ యాదవ్, రఘువీరారెడ్డి, నాగప్రభుగౌడ్, డాక్టర్ రాజుగౌడ్, రాజేందర్, సతీష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో కనీస వసతులు కరువు

● టాయిలెట్ల నిర్వహణ అస్తవ్యస్తం

● అందుబాటులో ఉండని తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు

● నిరుపయోగంగా గాలి నింపే యంత్రాలు

● అధికారుల పర్యవేక్షణ లోపంతో పట్టించుకోని నిర్వాహకులు

సంగారెడ్డి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని అనేక పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు కనీస వసతులు కరువయ్యాయి. పట్టణాలు, ప్రధాన రహదారులు, జాతీయ రహదారుల వద్ద ఉన్న పెట్రోల్ బంకుల్లో కనీస వసతులు కల్పించడంపై నిర్వాహకులు శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బంకుల్లో కనీస సౌకర్యాల కోసం పెట్రోలు డీజిల్ వేసుకునే ప్రతి వినియోగదారుడు లీటరుపై పన్ను రూపంలో చెల్లిస్తున్నారు.

కనీస సౌకర్యాలు నిల్..

జిల్లాలోని అనేక పెట్రోల్ బంకులలో కనీస వసతులు కల్పించడంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా అన్ని పెట్రోల్ బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉంచాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. పలుచోట్ల వీటిని ఏర్పాటు చేసినప్పటికీ వినియోగించేందుకు నిర్వాహకులు అనుమతి ఇవ్వడం లేదు. మరికొన్ని చోట్ల మరమ్మతుల పేరుతో వినియోగంలో ఉంచడం లేదు. బంకుల వద్ద స్వచ్ఛమైన తాగునీటి వసతి కల్పించేందుకు ప్రత్యేకంగా ఆర్వో ప్లాంటు, వాటర్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. చాలా చోట్ల తాగునీటి వసతి సౌకర్యం కల్పించడం లేదు. కనీస వసతుల కోసం ప్రత్యేకంగా వినియోగదారులు లీటర్ పెట్రోల్ గాని లీటర్ డీజిల్ గాని కొనుగోలు చేస్తే అందులో బంకుల నిర్వాహకులు ప్రతి లీటర్ పై 4 నుంచి 8 పైసల చొప్పున వసూలు చేస్తున్నారు.



సంగారెడ్డి సమీపంలోని ఓ బంక్‌లో నిరుపయోగంగా గాలి పంపు

ఫిర్యాదుల పెట్టె..ప్రథమ చికిత్స కిట్లు ఉండవు

ప్రతి పెట్రోల్ బంకులు ఫిర్యాదుల పెట్టె గాని రిజిస్టర్ గాని అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. ఏదైనా అకస్మాత్తుగా ప్రమాదాలు సంభవిస్తే ప్రత్యేకంగా ప్రథమ చికిత్స కిట్లు ఉంచాలి. అలాగే టైర్లలో గాలి నింపటానికి గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి బంకుల్లో కచ్చితంగా గాలి నింపే యంత్రాలు ఏర్పాటు చేసి, గాలి నింపేందుకు ఒక వ్యక్తిని అందుబాటులో ఉంచాలి. బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయకపోయినా వాహదారులు కోరితే టైర్‌లో గాలి తనిఖీ చేసి నింపాలి. బంకుల్లో పెట్రోల్, డీజిల్ నాణ్యత ప్రమాదం తెలుసుకునేందుకు పరికరాలను కూడా సిద్ధంగా ఉంచాలి. కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం శాఖ విధించిన నిబంధనలు అనేక పెట్రోల్ బంకులు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల పర్యవేక్షణ లోపం

పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా సంబంధిత పెట్రోలియం శాఖ, సివిల్ సప్లై శాఖల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వినియోగదారులకు పెట్రోల్ బంకుల్లో వసతులు కరువయ్యాయనే విమర్శలున్నాయి. బంకుల్లో ఉన్న సౌకర్యాలను వినియోగించుకునేందుకు పెట్రోలియం మంత్రిత్వ శాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించాల్సి ఉంటుంది. పెట్రోలియం మంత్రిత్వ శాఖ, సివిల్ సప్లై శాఖ అధికారులు తనిఖీలు కూడా సక్రమంగా చేయడం లేదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఫలితంగా పెట్రోల్ డీజిల్ లో కల్తీ అవుతున్నాయని విమర్శలున్నాయి.



ఓ పెట్రోల్ బంక్‌లో వాటర్ ఆర్వో ప్లాంట్ దుస్థితి

న్యూస్ బాక్స్

నేటి నుంచి మల్లన్న ఉత్సవాలు

● ఐదురోజుల పాటు నిర్వహణ
● భారీగా తరలిరానున్న భక్తులు



మల్లన్న గుడి, ముస్తాబవుతున్న రథం

టేక్మాల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొండల నడుమ కొలువైన టేక్మాల్ మండలం కాద్లూర్ గ్రామంలో గల మల్లికార్జునస్వామి ఉత్సవాలను నేటి నుంచి ఈనెల 5వ తేదీవరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. 1న బోనాలు, 2న బండ్ల శకటోత్సవం, 3న కుస్తీ పోటీలు, 4న రథోత్సవం, 5న పాచి బండ్లు ఊరేగింపు జరుతాయని తెలిపారు. కుస్తీ పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతితోపాటు 10 తులాల వెండి కడియాన్ని బహూకరిస్తామన్నారు. ఉత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరుకానున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి...



కండువా కప్పి బీజేపీలో చేర్చుకుంటున్న ఎంపీ రఘునందన్‌రావు

నర్సాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు వీర ఆంజనేయులుగౌడ్, సంతోష, అమరేందర్‌గౌడ్ ఆదివారం ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో ఆయన స్వగృహంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా నాయకులు అరవింద్‌గౌడ్ పాల్గొన్నారు.

కల్హేర్ ఎంఈవోగా సురేష్



బి.సురేష్

కల్హేర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జి మండల విద్యాధికారిగా మాసాన్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పీజీ హెచ్‌ఎం బి.సురేష్‌ను నియమిస్తూ పాఠశాలల రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు కల్హేర్ జడ్పీ ఉన్నత పాఠశాల పీజీ హెచ్‌ఎం శ్రీనివాసులు కల్హేర్ మండల ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగారు. ఈనెలలో ఆయన ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో సురేష్‌ను నియమిస్తూ ఆర్జేడి ఉత్తర్వులు జారీ చేశారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ

ఝరాసంగం/జిన్నారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఝరాసంగంలో ఆదివారం ముదిరాజ్ సంగన్న గురుస్వామి స్వగృహంలో అయ్యప్ప మహాపడి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దేవూజీ, తహసీల్దార్ తిరుమలరావు పాల్గొన్నారు. అలాగే జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని ఊట్లలో అయ్యప్పస్వామి మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు నీలం మధు, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా అంజాగౌడ్

నారాయణఖేడ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణానికి చెందిన అంజాగౌడ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు సూర్యాపేటలో నిర్వహించిన సంఘం రాష్ట్ర 4వ మహాసభల్లో భాగంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సుదీర్ఘకాలంగా పనిచేసిన అంజాగౌడ్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత రక్షణ, తీగ కార్మికులకు ఉపాధి, గౌడ కులస్థుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

శ్రీశైలానికి శివస్వాములు

రేగోడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం పురస్కరించుకొని 41 రోజులు దీక్ష చేపట్టిన శివస్వాములు ఆదివారం శ్రీశైలానికి బయలుదేరారు. దీక్ష పూర్తి కావడంతో ఇరుముడులను ఎత్తుకొని శ్రీశైలం మల్లిఖార్జున ఆలయంలో సమర్పించనున్నారు. ఈ సందర్భంగా శివస్వాములకు నూతన వస్త్రాలను పోలీస్ కృష్ణ అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిన్నారంలో జోరుగా మట్టి దందా

● పరిశ్రమలు, వెంచర్లకు తరలింపు
● ఒక్కోట్రిప్పుకు రూ.3 వేలు వసూలు
● పట్టించుకోని అధికారులు



జిన్నారం నుంచి పరిశ్రమలకు మట్టి తరలిస్తున్న టిప్పర్లు, శివ్వంపేట మండలం రూప్‌సింగ్‌తండా శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న తవ్వకాలు

జిన్నారం, నవంబరు, 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం జిన్నారం నుంచి పరిశ్రమలు, ప్రైవేట్ వెంచర్లకు మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఆదివారం భారీఎత్తున మట్టి తరలింపుతో స్థానికంగా రహదారులు దుమ్ము, ధూళితో నిండి ప్రమాదకరంగా మారాయి. జిన్నారం సర్వే నంబరు 1 నుంచి వారంరోజులుగా టిప్పర్ల ద్వారా 300 ట్రిప్పుల వరకు మట్టి రవాణా జరుగుతుంది. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.3 వేలకు విక్రయిస్తూ సహజ సంపదను కొల్లగొడుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్ తెలిపారు. అధికారుల అవినీతి, మట్టి తరలింపు వ్యవహారంపై ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

అక్రమ మట్టి తరలింపుతో ఇబ్బందులు

శివ్వంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆరోపించారు. మండల పరిధిలోని రూప్‌సింగ్‌తండా శివారులో ఆదివారం ఎక్స్‌కవేటర్ సహాయంతో బొమ్మనసముద్రం చెరువు కింది భాగం పొలంలో కొంతమంది తవ్వకాలు నిర్వహిస్తున్నారు. సుమారు 10 టిప్పర్లతో చండి శివారులోకి మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. అధిక లోడుతో టిప్పర్లు వెళ్తుండడంతో దుమ్ము, ధూళితో రోడ్డు కనిపించక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రామాలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం

● పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



రామచంద్రస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

గుమ్మడిదల/పటాన్‌చెరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో గల రామాలయం జీర్ణోద్ధారణ పనులకు సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం హానర్ ల్యాబ్ పరిశ్రమ సహకారంతో రూ.1.10 కోట్లతో చేపట్టనున్న ఆలయ ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాన్ని దైవత్వం ఉట్టిపడేలా పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ దశరథ్, సీనియర్ నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తులసీదాస్, పరిశ్రమ ప్రతినిధి రవీందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే పటాన్‌చెరు డివిజన్ పరిధి కృషి డిఫెన్స్ కాలనీలో జలమండలి చేసే తాగునీటి సరఫరాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు అమరేందర్, ఐలయ్య, అరుణ్‌బాబు, శ్రీరాములు, కోటగౌడ్ పాల్గొన్నారు.

గ్రూపు రాజకీయాలకు తావివ్వకండి : ఎమ్మెల్యే



చండిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్ రాజకీయాలకు తావు లేకుండా కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మండలంలో అధికంగా బీఆర్‌ఎస్ సర్పంచుల గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి కార్యకర్తలకు సూచించారు. మండల పరిధిలో చండిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సికింద్లాపూర్ గ్రామానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు బోనస్ ఇవ్వకుండా, రైతుబీమా అమలు చేయకుండా రైతులను మోసం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ పాల్గొన్నారు.

చట్టం రూపొందించి ఏటా బదిలీ, పదోన్నతులు చేపట్టాలి

● ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్



సాబేర్‌అలీని సన్మానిస్తున్న సదానందంగౌడ్, నాయకులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల చట్టం రూపొందించి ఏటా బదిలీ, పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్‌అలీ ఆత్మీయ అభినందన సన్మాన సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పీఆర్‌సీ గడువు ముగిసి రెండేళ్లయినా నివేదిక బహిర్గతం చేయకపోవడం సరికాదన్నారు. 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ అమలుచేసి ఉద్యోగులకిచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సయ్యద్‌సాబేర్‌అలీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శిగా నియమితులైన సాబేర్‌అలీని సీనియర్ నాయకులు, సభ్యులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెడ్ క్వార్టర్ సెక్రటరీ కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేశ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లోకి వలసలు

నర్సాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చిలప్‌చెడ్ మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు నర్సాపూర్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చిలప్‌చెడ్ మండలం శిలాంపల్లికి చెందిన ఎల్లయ్యగారి రాజేందర్‌రెడ్డి, కట్టమిది రాజిరెడ్డి, మసన్నగారి రాజేందర్‌రెడ్డి, ప్రవీణ్, రాజు తదితరులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా బీజేపీ నుంచి ఎల్లయ్యగారి ధుషంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి చేర్చుకున్నారు. కొల్చారం మండలం తుక్కాపూర్‌కు చెందిన మాజీ బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు దొడ్ల విశ్వపతి, హనుమప్ప, సంగమేశ్వర్ నాయకత్వంలో 30 మంది బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్ గ్రామానికి చెందిన 50 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫోర్ లేన్ రోడ్డు విస్తరణకు టెండర్ పూర్తి

● ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



వడియారంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వడియారం బైపాస్ నుంచి చేగుంట బైపాస్ వరకు ఫోర్ లేన్ రోడ్ విస్తరణకు టెండర్ పూర్తయ్యిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వడియారంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడియారం బైపాస్ నుంచి చేగుంట పట్టణం గుండా జాతీయ రహదారి 44వ బైపాస్ వరకు ఫోర్ లైన్ లోడ్ విస్తరణకు 4, 6 కిలోమీటర్లకు రూ.7 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కేసీఆర్ పాలనలో పాలనలో గ్రామాలన్నీ సస్యశ్యామలమయ్యాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కుంటుపడిందన్నారు. అనంతరం వడియారం మాజీ ఎంపీటీసీ బక్కి లక్ష్మీరమేష్‌కు గుండె సర్జరీ అయిన విషయం తెలుసుకుని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మోదం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు జీవన్‌రెడ్డి, శ్రీకాంత్, రమేష్, రాములుగౌడ్, స్వామియాదవ్, అలీ పాల్గొన్నారు.

అన్నిరకాల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు వేతన సవరణ వెంటనే అమలు చేయాలని, అన్నిరకాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీబీవీ సిబ్బంది వేతనాలు పెంచి నెలనెలా చెల్లించాలని కోరారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేస్తూ ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ సంజీవయ్య, జిల్లా ఉపాధ్యక్షులు నాజర్‌పటేల్, మల్లికార్జున్, కార్యదర్శులు శ్రీనివాస్, జగన్నాథం, రవీందర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి గర్భిణులు, దివ్యాంగులకు మినహాయింపు ఇవ్వాలి

● తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల విధుల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని, గర్భిణులు,, దివ్యాంగులకు మినహాయింపు ఇవ్వాలని టీపీయూఎస్(తపస్) జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ అధికారులను కోరారు. సంగారెడ్డిలో ఆదివారం వారు మాట్లాడారు. ఉద్యోగులకు పోస్టల్‌బ్యాలెట్ అనేది పెన్నుతో కాకుండా స్వస్తిక్ గుర్తుతోనే బ్యాలెట్ పేపర్‌పైన ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపులో పోస్టల్ బ్యాలెట్ సపరేట్‌గా కాకుండా సాధారణ ఓట్లతోనే లెక్కింపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు తుక్కప్ప, శ్రీపాల్, సంజీవకుమార్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ సమర్థవంతంగా నిర్వహించాలి

● మెదక్ అదనపు కలెక్టర్ నగేష్



చిన్నశంకరంపేటలో నామినేషన్ల సరళిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, నిజాంపేటలోని నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో రమాదేవి

చిన్నశంకరంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రెండో దఫా ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ ఎన్నికల సిబ్బందికి సూచించారు. ఆదివారం చిన్నశంకరంపేట మండలంలోని నామినేషన్ల ప్రక్రియను జడ్పీ సీఈవో ఎల్లయ్యతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభుదాస్, ఎంపీడీవో దామోదర్, ఎంపీవో గిరిజారాణి పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాలను తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పరిశీలించారు. ఆయన వెంట రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్‌ఐ నారాయణ ఉన్నారు.

●చేగుంట: చేగుంటలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను అదన కలెక్టర్ నగేష్ సందర్శించి పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీవో ప్రశాంత్ ఉన్నారు.

●నిజాంపేట: నిజాంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు ఏర్పాటు చేసిన నామినేషన్ ప్రక్రియను ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీవో నరసింహారెడ్డి, ఎంఈవో యాదగిరి, ఎన్నికల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

●ఝరాసంగం: మండల పరిధిలోని కప్పాడ్ గ్రామంలో గల నామినేషన్ కేంద్రాన్ని ఆదివారం జహీరాబాద్ ఆర్డీవో దేవూజీ పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ తిరుమలరావు, డిప్యూటీ తహసీల్దార్ కరుణకర్‌రావు, ఆర్‌ఐ సాయికిరణ్, సిబ్బంది ఉన్నారు.

●వట్‌పల్లి : వట్‌పల్లి మండలంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఎంపీడీవో సాయితరుణ్, డీఎస్పీ సత్తయ్యగౌడ్ ఆదివారం పరిశీలించారు. ఆయనవెంట సీఐ అనిల్, ఎస్‌ఐ లవకుమార్ పాల్గొన్నారు

●పుల్‌కల్: పుల్కల్, చౌటకూర్ మండలాల్లోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ పరిశీలించారు. ఆయన వెంట పుల్కల్ ఎస్‌ఐ ఎన్.విశ్వజన్ తదితరులున్నారు.

●చేగుంట: చేగుంటలో నామినేషన్ కోసం ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను డీఎస్పీ సత్తయ్యగౌడ్ పరిశీలించారు. ఆయన వెంట రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్, ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి ఉన్నారు.

క్రికెట్‌లో జాతీయస్థాయికి 'ఎస్‌వీ' కాలేజీ విద్యార్థి

● అభినందించిన ప్రిన్సిపాల్



నెవిన్ మానిత్‌ను శాలువాతో సన్మానించి అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అండర్-19 జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు సంగారెడ్డిలోని ఎస్‌వీ జూనియర్ కళాశాలకు చెందిన సీఈసీ ద్వితీయ సంవత్సర విద్యార్థి నెవిన్‌మానిత్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి నెవిన్ మానిత్‌ను శాలువాతో సన్మానించి అభినందించి మాట్లాడారు. జాతీయస్థాయి నుంచి అంతర్జాతీయస్థాయిలో సత్తాచాటి కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. కాగా మానిత్ సంగారెడ్డిలోని ఎంఎస్ క్రికెట్ అకాడమీలో ఐదేళ్లుగా శిక్షణ పొందుతున్నాడు. హెడ్ కోచ్ శ్రీనాథ్‌రెడ్డి, సహాయ కోచ్‌లు చంద్రమౌలి, ఇనామ్‌ల ప్రత్యక్ష పర్యవేక్షణలో క్రికెట్‌లో తర్ఫీదు పొంది జాతీయస్థాయికి ఎంపికకావడం గర్వంగా ఉందని ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, తల్లిదండ్రులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు



రహదారికి ఇరువైపుల నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్

నర్సాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలో మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్‌తో పాటు అడ్డగోలుగా వ్యాపారుల ఆక్రమణలపై ఫిర్యాదులు రావడంతో అధికారులు స్పందించారు. ఈ మధ్యనే ఎస్‌ఐ రంజిత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను తొలగించారు. ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల వాహనాలు పార్కింగ్ చేయకుండా నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేయించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఖేడ్‌లో అట్టహాసంగా శోభాయాత్ర

నారాయణఖేడ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మనూరు మండలం కమలాపూర్‌లో ఆదివారం ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని నారాయణఖేడ్‌లో అన్యక్షేత్రాల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మంగల్‌పేట దుర్గామాత ఆలయం నుంచి శోభాయాత్రను ప్రారంభించారు. కాషాయపు ధ్వజాలతో శోభాయాత్ర కమలాపూర్ వరకు నిర్వహించారు. ఈ యాత్రలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, దుద్యాల పీఠాధిపతి అంబికా శివయోగి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను బానిసలుగా మార్చడానికే లేబర్ కోడ్‌లు

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య



మాట్లాడుతున్న వీరయ్య

రామచంద్రాపురం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అమాయక కార్మికులను కట్టుబానిసలుగా మార్చడానికి లేబర్‌కోడ్‌లను అమలు చేస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య అన్నారు. ఆదివారం రామచంద్రాపురం బెల్‌లో లేబర్‌కోడ్‌ల అమలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులను బానిసలుగా మారుస్తున్న లేబర్‌కోడ్‌ల అమలును తక్షణం నిలిపివేయాలని కోరారు. కంపెనీల్లో యూనియన్లు పెట్టడం, సమ్మెచేసే హక్కులను కాలరాయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. కార్మిక వర్గం సంఘటితంగా ఉంటూ పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో రాజయ్య, పెంటయ్య, భాషా పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో దోపిడీ

● అదనంగా రెండు కిలోలు తూకం వైనం



బ్రాహ్మణపల్లిలోని కొనుగోలు కేంద్రం

నర్సాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు జోకాల్సిన దానికంటే అదనంగా జోకుతూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం 40 కిలోల 250 గ్రాములు జోకాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా రెండు కిలోలు తరుగు పేరిట ఎక్కువ జోకుతూ అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అంతటా అలాగే తీసుకుంటున్నారు. మీ ఇష్టం ఉంటే విక్రయించండి లేకుంటే లేదంటూ కసురుకుంటున్నారని వాపోయారు. ఈ విషయమై రైతు రక్షణ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి కేంద్రాల వద్ద దగా చేయడం తగదని ఆర్డీవో, తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని కోరారు.

పద్మశాలీసంఘం పట్టణ కమిటీ ప్రమాణ స్వీకారం

చేర్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీసంఘం చేర్యాల పట్టణ నూతన కమిటీ ఇటీవల ఎన్నిక కాగా, ఆదివారం స్థానిక మార్కండేయ ఆలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా కొక్కుల సురేందర్, కార్యదర్శిగా పాము బాలనర్సయ్య, కోశాధికారిగా మలిపెద్ది వెంకటేశం, ఉపాధ్యక్షులుగా ఆడెపు వెంకయ్య, గోనె హరి, తడకపల్లి చందుతో పాటు కార్యవర్గసభ్యులతో సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తూరి సతీశ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడుతూ పద్మశాలీలకు తాను అండగా ఉంటానని చెబుతూ, నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.